4823
శ్రీకాకుళం

# "మెచ్చనిదైవం-నచ్చనివరం"

అది చిన్న కొండ. కొండమీద గుడి.

గుడిలో దేవుడు. దేవేరితో కొలువై ఉన్నాడు. ఎవరో అమ్మవారి అష్టోత్తరం చేయిస్తున్నారల్లే ఉంది. పూజారి ఆచారి గొంతుక బిగ్గరగా—"పద్మహస్తానమః ఓం, పద్మాక్షైనమః ఓం, పద్మసుందర్యైనమః ఓం ...." అంటూ గుక్కకూడా తిప్పుకోనంతటి వేగంలో వినిపిస్తూంది. అప్పుడే గుడి ఆవరణలో అడుగు పెట్టిన ట్రస్ట్ బోర్డు ఛెయిర్‌మన్ పద్మనాభరావుకు ఆచారి గొంతుకలో స్పష్టంగా వినిపిస్తున్న కచ్చ, నవ్వు తెప్పించింది.

"ఆఁ! ఆఁ! హారతి తీసుకోండి. ఆ నాలుగు పైసలూ హుండీలోనే పారెయ్యండి. నిజానికి హారతి పళ్ళెంలో వేయవలసిన బాధ్యత మీకూ, అవి తీసుకోవలసిన ఆశ మాకూ అనాదిగా ఉంటున్నదే అయినా, ఇప్పుడు కొత్తరూల్సు పెట్టారులే కొందరు పెద్దలు! ఆఁ! కాకున్నా, ఆ నాలుగు పైసలు పళ్ళెంలో వెయ్యగానే మా బ్రతుకులు గడిచిపోతాయా ఏమిటి?" విసురుగా నెత్తిముడి ఓసారి ఝాడించి వేసుకుని, పద్మనాభరావును చూడనట్లే, వచ్చిన భక్తులతో అంటున్నాడు ఆచారి.

పద్మనాభరావు మౌనంగా ప్రదక్షిణచేసి వచ్చి, గుడి వెనకగా ఆవరణ పిట్టగోడ నానుకుని నిలుచున్నాడు. నేలమట్టానికి సుమారు వెయ్యి అడుగుల ఎత్తులో ఉందీ కొండ. మూడు వేపులా దట్టమైన ఆకు పచ్చ తివాచీ పరిచినట్లున్న అడవి, ఆ అడవి మధ్యలో ఆ కొండ, చుట్టుప్రక్కల ఉన్న సుమారు పది పదిహేను గ్రామాలకు వెళ్ళే బండిబాటలూ, చిన్నచిన్న వంకలూ తెల్లని పాముల్లా కనిపిస్తున్నాయి అక్కడికి.

కొండకు నాలుగో వేపు అగాధమైన లోయ! ఎవరో భక్తుడు ఎన్నో తరాలక్రితం ఈ లోయ వేపు కొండరాళ్ళతోనే మెట్లు వేయించాడు. ఆ మెట్లు ఎగుడు దిగుడుగా ఉంటాయి. ఏ తరాలలో వారా మెట్లు ఎక్కి కొండమీదికి వచ్చేవారో తెలియదుగానీ, ఇప్పుడు మాత్రం చాలా మంది భక్తులూ, కొందరు కోటీశ్వరులూ, మరికొంత దేవాదాయ శాఖవారూ కలిసి వేసిన మరోవేపు ఉండే సిమెంటు మెట్లమీదుగానే యాత్రికులు కొండపైకి వస్తారు. అందుచేతే ఆ లోయవేపు మెట్లు మనుష్య సంచారంలేక పాడు పడి ఉన్నాయి. మెట్టుకూ, మెట్టుకూ మధ్య పక్కన ఉన్న మట్టిలో ముళ్ళ చెట్లూ, పిచ్చి మొక్కలూ మొలిచి ఆ దారి కడ్డంగా ఉంటుంది. ఎవరో కట్టెపుల్లలు కొట్టుకుని జీవించే కొండచుట్టుపక్కలవారూ, తేనెపట్లు గాలించేవారూ, ప్రొహిబిషన్ ఎత్తివేయక ముందు కొండ మధ్య నున్న పెద్ద పెద బండరాళ్ళ మాటున నాటుసారా కాచేవాళ్ళు కొందరు....సర్వీసుగా ఎక్కుతుంటారా మెట్లమీద.

సిమెంటు మెట్లు ఉన్న వేపే, కొండ క్రిందుగా బస్సు రోడ్డు ఉంది! చిన్న సత్రమూ ఉంది. యాత్రికులు బస్సు దిగి సత్రంలో బస చేసి, సిమెంటు మెట్లమీదుగా కొండమీదికి వచ్చి దేవుణ్ణి కొలిచి వెళతారు.

ఎందుచేతో, ఆ కొండమీద కొలువై ఉన్న దేవుడికి శనివారం మాత్రం పూజలు జరుగుతాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సత్రం దగ్గరకు జనం వస్తూంటారు. శనివారం ఉదయం నుంచీ సాయంత్రం వరకూ కింద సత్రమూ, సిమెంటు మెట్లూ, కొండా, గుడీ గోవిందనామ స్మరణలతో, మొక్కుబడులతో, కొబ్బరికాయలుకొట్టే చప్పుళ్ళతో మ్రోగించే గంటల మ్రోతలతో, అష్టోత్తరాలతో చైతన్యవంతంగా, కోలాహలంగా ఉంటుంది. మిగతావారాలలో మౌనంగా తపస్సుచేసుకుంటున్న మునిలా ఉంటాయి.

ఆ కొండ చుట్టుప్రక్కలున్న గ్రామాలలో, తాలూకాలలో ఆకొండ మీది దేవుడిపట్ల విపరీతమయిన భక్తి విశ్వాసాలున్నాయి చాలామంది ప్రజలలో ! అమ్మాయి పుడితే ఆ అమ్మవారి పేరూ, అబ్బాయి పుడితే ఆ దేవుడి పేరూ పెట్టుకోవటం ఆనవాయితీగానూ ఉంది చాలా కుటుంబా లలో. తలనీలాలు ఇవ్వటం,నిలువుదోపిడీ ఇవ్వటం, అమ్మవారి తలంబ్రాల బియ్యం అంటూ పంటలు బాగా పండినప్పుడు తూములకొద్దీ బియ్యం ఇవ్వటం, మంచి గుమ్మడిపండ్లు పిల్లలు పుడితే దేవుడికి సమర్పించటం— ఒకటేమిటి ? ఆ చుట్టు ప్రక్కల వారికి అదే కలియుగ వైకుంఠం. ఆ దేవుడే పిలిస్తే పలికే దేవుడు.

ఆ కొండ చుట్టుప్రక్కల గ్రామాలలోనే ఒక గ్రామంలో పుట్టాడు పద్మనాభం. 'పద్దుగాడు' గా 'పద్దనాభం' గా ఆ ఊరి ఎలిమెంటరీ స్కూల్లో అయిదో క్లాసు వరకూ చదివాడు. అతగాడితోబాటు ఆ ఊళ్లోనే పుట్టి, చదివిన 'కాంతిగాడు' కాంతయ్యగా మారి హైస్కూల్లో చేరాడు బస్తీలో. 'పద్దనాభం' కూడా పద్మనాభరావుగా ఫస్టుఫారంలో చేరాడు. ఫిఫ్తుఫారమ్‌లో ఉండగా పద్మనాభం తండ్రి హఠాత్తుగా చనిపోయాడు. కుటుంబపు కాడి మెడమీద వేసుకోక తప్పలేదు పద్మనాభానికి. చదువుకు స్వస్తిచెప్పి వ్యవసాయం చేబట్టినా, అతగాడిలో అన్ని సంగతులూ తెలుసుకోవాలన్న తృష్ణమాత్రం అణగారిపోలేదు. చదువువలన ఎక్కువ సంస్కారమూ, విషయ పరిజ్ఞానమూ, నిజమైన మనిషిగా ఏదో మంచి చేయాలన్న తపనా అతగాడితోపాటు పెరిగాయి. కాంతయ్య కాంతారావుగా చదువు కొనసాగించాడు. కాలేజీలో చేరాడు. డిగ్రీ తెచ్చుకున్నాడు. రాజ కీయాలలో దిగి, చిన్న చిన్నగా ఒక్కో మెట్టూగా పైకి పాకుతున్నాడు. బస్తీలోనే కాపురం పెట్టాడు.

పద్మనాభానికి చిన్నతనం నుంచీ ఈ కొండన్నా, కొండమీది దేవుడన్నా ఎనలేని భక్తి. పరీక్ష పాసైనా, జ్వరంవచ్చి తగ్గినా "కొండెక్కి కొబ్బరికాయ కొట్టి, తలనీలాలిస్తాను!" అంటూ మొక్కు కోవటం, మొక్కు చెల్లించటం అతగాడికి అలవాటుగా మారిపోయిందా రోజుల్లో!

"సంవత్సరానికి ఆరునెలలు మా వాడి తల నున్నగా ఉంటుంది!" అంటూ స్నేహితులు వేళాకోళం చేసేవారు కూడా.

ఆ దేవుడి గుడి చిన్నదిగా, ఇరుగ్గా, లోపల వెలుగు లేకుండా ఉక్కగా ఉంది. పాపం! ఆ పూజారి ఒంటినిండా చెమటే! ఆ గుడి కాస్త విశాలంగా, కిటికీలు అవీ అమర్చి, అందంగా కట్టిస్తే....?

ఆ దేవుడిమెళ్ళో నగలేమిటో వెలవెలబోతున్నట్లున్నాయి. హుండీలో నిలువుదోపిడీ నగలన్నీ వేస్తున్నారు. ఆ నగలన్నీ చెరిపించి, దేవుడికి నగలుగా చేయిస్తే? ఆ అమ్మవారికి ముతకరకం బట్టలు కట్టబెడుతున్నారు! వారం వారం పట్టుచీరె కట్టబెట్టించాలి. ముక్కెర, దుద్దులు అరచేతిలో పద్మం అన్నీ ఎర్రటి కెంపులతో ధగధగ మెరసి పోయేలా చేయించాలి. తిరపతి కొండమీదికిలా ఈకొండమీదికీ బస్సురూటు వేస్తే? నిత్యనైవేద్య దీపారాధనలు జరిగేలా చూస్తే? రోజూ ఆదాయం పెరుగుతుంది. ఆ డబ్బుతో దేవుడి పేరుతో హైస్కూళ్ళు, ఆస్పత్రులు, ఇంకా ఎన్నో ఎన్నో మంచి పనులు అందరికి ఉపకరించేవి చేయిస్తే? ఈ కొండ, ఈ దేవుడు ఈ రాష్ట్రంలోనే గొప్పగా గుర్తింపబడితే!

ఇలా ఏవేవో ఆలోచనలు. అవి ఎవరు చేయాలి? ఎవరు చేయిస్తారు? అన్నది పద్మనాభానికి తెలియలేదు. కానీ, లోలోపల అవన్నీ జరగాలని ఏదో ఆవేశం, మరేదో ఆవేదన అతగాడితోబాటు పెరిగిపోయాయి. పద్మనాభానికి ఉన్న భూమీ, సంపదా తక్కువే అయినా

ఆ గ్రామంలోనూ, ఆ చుట్టుపక్కల గ్రామాల్లోనూ మాట మంచితనంతో, నిష్పాక్షికమైన తీర్పులతో మంచి పేరు తెచ్చుకున్నాడు.

అనుకోకుండా కాంతారావు దేవాదాయశాఖ మంత్రిగా మారాడు. దానితో స్థానికంగా పద్మనాభానికికూడా పలుకుబడి పెరిగింది. "పద్మనాభ రావుగారు!" అంటూ కొందరు మన్నించటంకూడా ప్రారంభించారు. కొండమీద గుడికి ట్రస్టీ బోర్డు మెంబర్లలో పద్మనాభరావు పేరు సూచించ బడింది. అతగాణ్ణే ఏకగ్రీవంగా ట్రస్టు బోర్డు ఛెయిర్‌మన్‌గా ఎన్ను కున్నారు కూడాను! ఆ రోజు పద్మనాభం కలలో కనిపించిన పెన్నిధి ఇలలో ఎదురైనంతగా ఆనందపడ్డాడు!

"మా ఆయనకు టస్టు.... పేరుమేనంట .... అదేదో ఉద్యోగం వచ్చింది! మరాయన సదూకున్నోడాయె! ఎందుకు రాదూ! ఇకమీదట నాకు బోలెడన్ని నగలు వస్తాయి!" అంటూ ఇరుగు పొరుగులతో చెప్పు కుంటున్న భార్య రత్నం మాటలకు చిరాకు పడ్డాడు, సిగ్గుపడ్డాడు పద్మనాభం.

"ఈ ఉద్యోగం డబ్బు తీసుకుని చేసేది కాదే, రత్నం! దేవుడి సేవ చేసేందుకే! న్యాయంగా దేవుడికి చెందవలసిన డబ్బు దేవుడికే చెందేలా చేసి, ఆ డబ్బుతో యాత్రికులకు ఎన్నో సౌకర్యాలు చేయ టానికీ, మరెన్నో ప్రజోపయోగకరమైన పనులు చేయటానికీ ఉపయోగ పడాలి నా ఈ పదవి! ప్రలోభపడటానికి కాదు!" అన్నాడు. అదంతా రత్నమ్మ కర్థం కాలేదు. జీతంలేని ఉద్యోగమైతే మరీ మంచిది. జీతానికి పదింతలుగా గుంజవచ్చు అనుకుందా ఇల్లాలు. ఇక ఆమెకు నచ్చచెప్పటం అనవసర మనుకున్నాడు పద్మనాభం.

మొదటి నెలలో నాలుగు వారాలూ కొండమీదికి వెళ్ళిన పద్మనా భానికి ప్రపంచంలో దొంగతనా లన్నవి కేవలం రాత్రి వేళల కన్నాలు

వేసీ, పగటివేళ జేబుదొంగతనాలు చేసీ, బాంకులు దోచీ—అలా మాత్రమే ఉండవనీ, కొందరు దొంగలకు స్థలప్రభావంగానీ, దైవభీతిగానీ ఉండవనీ ఋజువై పోయింది.

యాత్రికులు తలనీలాల మొక్కుబడి చెల్లించుకోవటానికి వస్తే దేవస్థానం లెక్కప్రకారం తలకు రూపాయిన్నర టిక్కెట్టు తీసుకోవాలి. తీరా మంగళ్ళ ముందుకు వెళ్ళి కూర్చున్నాక, తల చుట్టూరా నాలుగు గంట్లుపెట్టి తలకు రెండు రూపాయలు చెల్లిస్తేగానీ జుట్టు పూర్తిగా తీయమంటారు వాళ్ళు. వికృతమైన ముఖాలతో మొక్కు చెల్లించుకోకుండా ఎలా వెళతారా యాత్రికులు ? వారిలో ఎక్కువ మంది గ్రామీణులు, చదువు రానివారు, కంప్లెయింటు చేయటానికి సాహసం లేనివారు. అథవా ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుతో ఎవరేనా చెప్పుకోబోయినా—మొక్కు కోసం ఇంత దూరం వచ్చిన వాళ్ళు, పోనీ ఆ రెండు రూపాయలూ ఇస్తే పోలే !" అని తీర్పు చెబుతాడు.

"ఇదే మన్యాయం ! మీకు దేవస్థానం జీతా లిస్తోంది: యాత్రికులు టిక్కెట్లు కొన్నారు ! మధ్యలో ఈ దోపిడీ ఏమిటి ?" అని గద్దించాడు పద్మనాభం. మంగలి వీరాస్వామి ఇకిలించాడు. "మీరు కొత్తగా వచ్చారు. అదంతేలెండి.... అనాదిగా సాగుతున్నదే ! అడ్డం లెగండి. ఈ తడిజుట్టు మురికి మీ ఒంటిమీద పడుద్ది !" అంటూనే పెద్ద పెద్ద జుట్టంతా వేరుగా ఏది ఓగోతాంలో వేసి, చిన్నచిన్న పొట్టి జుట్టు మాత్రం ఆఫీసురూమ్‌లోకి తీసుకెళ్ళాడు తూకం వేయించటానికి !

విస్తుపోయి నిలుచుని ఉన్న పద్మనాభం దగ్గరకు మరో మంగలి తిరపతి వచ్చి, "అట్టా సూస్తారేటి బాబూ ! ఆ పెద్ద జుట్టు సవరాలు కట్టి కొని ఈ చుట్టుపక్కల గ్రామాలలో అమ్ముకుంటాం. అమ్మగారికి కూడా,

ఓ మాంచి నవరం ఏసి పంపుతాం లెండి!" అన్నాడు, మంచి చేసు కుంటున్నట్లు. శరీరం జలదరించింది పద్మనాభానికి.

నౌకర్లూ, ఆఫీసుగుమస్తాలూ లాలూచీ! ధర్మదర్శనానికని మనిషికి పది పైసల టిక్కెట్టు అమ్ముతారు. గర్భగుడి ముందు క్యూలో అక్క డక్కడా ఉండే నౌకర్లు ఆ టిక్కెట్టు తీసుకొని చింపకుండా జేబులో వేసు కుంటారు. అలా పోగయిన టిక్కెట్లు మరో నౌకరుద్వారా తిరిగీ ఆఫీసు రూమ్ చేరుకుంటాయి! మరో యాత్రికుల బృందానికి అవే టిక్కెట్లు తిరిగీ అమ్మబడతాయి. ఎన్ని వందలమంది యాత్రికులు వచ్చినా, టిక్కెట్ల బుక్కులో టిక్కెట్లు వందలోపలే చింపబడతాయి! పది రూపాయల లోపు డబ్బే దేవస్థానానికి జమ అవుతుంది!

"ఇదేమిటి?" అంటూ గద్దించిన పద్మనాభానికి జవాబుగా ఆఫీసు గమస్తా నవ్వాడు. "ప్రతిరంగంలోనూ జరుగుతున్నదే!" అన్నాడు నిర్లక్ష్యంగా.

ఇక అమ్మవారికై తెచ్చే పసుపుకొమ్ములు, కుంకుమ, రవికెల గుడ్డలు, చీరెలు, ఎండుకొబ్బరి గిన్నెలు ఏమీ లెక్కతేలవు సరికదా, అవి ఆచారి, శేషగిరి, నరసయ్యలాటి పూజారుల సంచీలలోకి వెళతాయినేరుగా. తలం బ్రాలకంటూ రాసిపోసిన బియ్యం, ధాన్యం, పూజారులూ, నౌకర్లూ.... అంతా సమంగా పంచుకుంటారు! దేవుడికి జమఅయ్యేది నాలుగైదు కిలోల లోపుబియ్యం, నాలుగైదు రవికెల గుడ్డలూ, అయిదారు కొబ్బరిగిన్నెలూ!

నిలువుదోపిడీ సొమ్మూ, డబ్బూ హుండీలో వేస్తే అవి లెక్క చూచేటప్పుడు చేతివాటంతో చిన్న చిన్న నగలు కాజేస్తారు. కొన్నిటిలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు కనకారావుకూ వాటా వుంది. పూజారులు అష్టోత్తరా లని పేరేగానీ, కేశవనామాలతో, మరి నాలుగు నామాలతో పూజముగించి హారతిపళ్లెం పడతారు కానుకల కోసం! ఇవన్నీ కళ్ళారా చూచిన పద్మ

నాథానికి మతిపోయినంత పనైంది. వారం వారం సుమారు నాలుగు వందల రూపాయలకు తగ్గని ఆదాయం వస్తూంది దేవుడికి ! నిలువుదోపిడీ సొమ్ముతో సహా లెక్కవేస్తే సంవత్సరానికి పాతికవేల రూపాయలకు పైగానే ఉంటుంది. ఆ డబ్బుతో గుడి బాగుచేయించవచ్చు. దేవాదాయ శాఖకు అర్జీ పెట్టుకుని, గ్రాంటు తెచ్చుకుని, కొండమీదికి రోడ్డు వేయించుకో వచ్చు. దేవుడికీ, దేవేరికి మంచి బట్టలూ, నగలూ చేయించవచ్చు. ప్రతి ఐదారు గ్రామాలకూ కనీసం ఎయిత్‌స్టాండర్డు వరకూ అయినా ఉండే హైస్కూళ్లు దేవుడి పేరుతో వేయించవచ్చు. ఎవరు చేస్తారివన్నీ ?

పద్మనాభం పిడికెళ్ళు బిగబట్టాడు. 'నేను చేస్తాను ! నేను చేస్తాని వన్నీ !' అనుకున్నాడు దృఢంగా. ఓసారి కాంతారావు దగ్గరకి వెళ్ళి తను ఆదేవస్థానాన్ని బాగుచేయదలచుకున్నట్లు చెప్పాడు. కాంతారావు తనసహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ధైర్యం చెప్పాడు. కొండంత బలం వచ్చింది పద్మనాభానికి.

అంతే ! మరు నెలనుంచి పద్మనాభం అరివీర భయంకరునిలా మారిపోయాడు. కొండ నాలుగువైపులా వీరవిహారం సాగించాడు. మంగళ్ళ మామూలు వీలుకాదన్నాడు. యాత్రికులనూ హెచ్చరించాడు అలా ఇవ్వవద్దని. బోర్డు కట్టించాడు కల్యాణఘట్టం దగ్గర ! మొక్కుబడుల తల నీలాలన్నీ తూకం వేయించటం మొదలెట్టాడు కరెక్టుగా. తలంబ్రాల బియ్యం మొదలు కొబ్బరి గిన్నెల వరకు తూకం వేయించి జమ వేస్తున్నాడు ! హుండీ తెరచినప్పుడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వెనకాలే తోకలా నిలుచుని వేయికళ్ళతో కనిపెడుతున్నాడు. ఏ ఒక్కరూ చేతి వాటం ప్రదర్శించేందుకు వీలు కలగనివ్వటం లేదు. ఆ నెలలో దేవుడి ఆదాయం పద్నాలుగు వందలా చిల్లరగా లెక్క తేలింది !

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు కనకారావు కనుబొమలు ముడిపడ్డాయి. పూజారుల పళ్లు పటపటలాడాయి మంత్రోచ్ఛారణలతో ! మంగళ్ళకత్తులు ఆకురాయిమీద ఆదేపనిగా రాపిడి పడ్డాయి. నౌకర్ల కళ్ళలో నిప్పురవ్వలు కురిశాయి. గుమాస్తాల నిట్టూర్పులు ఎక్కువయ్యాయి. కొండమీది వాతావరణం పైన కాస్తున్న ఎండ కంటే వేడిగా, మరింత వేడిగా మారిపోయింది. కానీ, ఎవరికి వారు ఏమీ చేయలేక పోతున్నారు. పద్మనాభానికి ఓ పెద్ద మంత్రిగారి అండదండ లున్నాయి ! అదే చిక్కు.

"ఇలా ప్రతిదీ లెక్క తేల్చాలంటే కష్టమండీ పద్మనాభరావు గారూ ! దేవుడిముందు రోజూ నైవేద్యంగా పంచభక్ష్య పరమాన్నాల గుండిగలు పెడతాం. అవన్నీ దేవుడు తింటున్నాడా ? నిజంగా దేవుడే తినేట్లయితే, మనుషులసలు నైవేద్యం పెడతా రంటారా ? పెట్టగల రంటారా? నమ్మకంగా తినడనితెలిసే నైవేద్యం పెడుతున్నాం. అవునా?" అన్నాడు కనకారావు ఉపక్రమణికగా. ఆ తరవాతి భావమేమిటన్నట్లు చూశాడు పద్మనాభం.

"కాబట్టి దేవుడి సొమ్ము అందరిదీ ! ఏ ఒక్కరిదీకాదు. పది మందీ బ్రతుకుతుంటే, కందకు లేని దురద కత్తిపీటకన్నట్లు మీరు మరీ ఎక్కువగా లెక్కలు తేల్చటం ఏమంత సబబుగా ఉందీ ?" కనకారావు ఎంత అణుచుకున్నా అతగాడిలో దాగిఉన్న కోపం ప్రతిధ్వనించిందా మాటలలో.

"పోనీ, మీరన్నట్లు దేవుడి సొమ్ము అందరిదేననే అనుకుందాం. దాన్ని కొండమీది పదిమందే తినేకంటే కొండక్రింద అందరూ కూడా తింటారు. ప్రజోపయోగకరమైన పనులు చేస్తే ఆ సొమ్ము అందరికీ చెందుతుంది కాదా ?" అన్నాడు పద్మనాభరావు చిరునవ్వు నవ్వుతూ.

"మంగళ్ళూ, పూజారులూ, నౌకర్లూ, గుమాస్తాలూ - వీళ్ళంతా ప్రజలు కారా? వాళ్ళకిచ్చే కొద్దిపాటి జీతాలతో పక్కన ఏ ఆదాయమూ లేకుండా తలలు గొరగటమూ, అష్టోత్తరాలూ, వాకిలి కాయటాలూ, లెక్క జమ వ్రాయటాలూ, వారం వారం ఈ కొండ ఎక్కి దిగటాలూ ఎందుకు చేయాలంటారు? రూపాయికి శేరు బియ్యం రాని ఈ రోజుల్లో తనను మించిన దైవభీతి ఎవరి కుందంటారు?" సవాలు చేస్తున్నట్లు అడిగాడు కనకారావు. మిగతా వాళ్ళంతా అతగాడి వాగ్దాటికి మెప్పుదలగా తల లాడించారు. పద్మవ్యూహంలోకి దారి చేసుకుంటూ వెడుతున్న అభిమన్యుడిలా ఒంటరిగా, పట్టుదలగా కూర్చున్నాడు పద్మనాభం.

"ఆ మాటన్నారు, బాగుంది. దేవాదాయ శాఖవారికి అర్జీ పెట్టు కుందాం. జీతాలు పెంచాలని కోరుదాం. జీతాలు పెంచేట్టు చేసే పూచీ నాది! అసలు ఆ దిట్టం (దిట్టం అంటే ప్రతి దేవస్థానంలోనూ ఆ యా దేవుళ్ళకు జరుపబడవలసిన సేవలూ, వాటికై కేటాయింపబడిన ధనమూ, పూజారులు మొదలు నౌకర్ల వరకు ఆ యా వ్యక్తులకు చెందవలసిన జీత భత్యాలూ వగైరా వివరాలు వ్రాసి ఉండే దేవస్థానం పుస్తకం) ఇవ్వండి. దాన్ని చూచి, మార్పుచేయవలసి ఉంటే కమిటీ మీటింగులో తీర్మానం చేద్దాం" అన్నాడు పద్మనాభం.

కనకారావు క్షణకాలం నిర్విణ్ణుడైనాడు. దిట్టం అడిగేంతటి మొనగాడైనాడా ఈ పద్మనాభం! అన్నట్లున్నాయి అతగాడి చూపులు.

"జీతాలు పెంచితేమాత్రం అలవాటు ప్రకారం ఏదో కాస్త...." నసుగుతున్న నౌకర్ల వేపు కోపంగా చూశాడు పద్మనాభం.

"అదేం కుదరదు .... జీతాలు పెంచాలనటం దొంగతనాలు మానుకోవడానికే! హాయిగా రాచబాట ఉండగా పక్కమార్గాలలో పోతా మంటారెందుకూ?" అంటూ మందలించాడు.

సంవత్సరంపాటు సాగిన ఈ అంతర్యుద్ధంలో పద్మనాభం అడుగడుగునా గెలుస్తూనే ఉన్నాడు. దేవస్థానం ఆదాయం ముప్పై వేల దగ్గరకు వచ్చింది!

'ఇంకొక్క ఇరవై వేలు అయితే, ఈ లోగా దేవాదాయ శాఖ వారికి అర్జీ పెట్టుకుని, ఈ లోయ వేపు మెట్లప్రక్కగా కొండ చుట్టూరా మెలికలు తిరుగుతూ బస్సు రోడ్డు వేయించవచ్చు. కొండ క్రింద మరో సత్రం కూడా ప్రారంభించాలి' అనుకున్నాడు పద్మనాభం ఆనందంగా.

* * * * * *

"అయ్యా, పద్మనాభరావుగారూ! తమ రొస్తే....ఆఖరుగా తమరి పేరుతో అష్టోత్తరం చేసేసి లెక్కలు చూచుకుందాం!"

దగ్గరగా పూజారి గొంతుక వినిపించటంతో ఉలిక్కిపడ్డాడు పద్మనాభరావు. ఇందాకా గొలుసుకట్టులా సాగుతున్న అతగాడి ఆలోచనలు గతంలోనుంచి వర్తమానంలోకి వచ్చాయి. ప్రతి వారం, చివరగా తన పేరుతో అష్టోత్తరం టిక్కెట్టు కొని పూజ చేయిస్తాడు పద్మనాభం.

"వస్తారా?" మరోమారు కఠినంగా అడిగాడు శేషగిరి. అతగాడి చెవులకున్న బంగారు కుండలాలు కసిగా ఊగాయి. పాపం! వీళ్ళెవరూ బంగారు నగలు చేయించుకోలే దీదుద్య. లోలోపల నవ్వుకుంటూ, "పదండి వస్తున్నా!" అంటూ గుడిలోకి వచ్చాడు పద్మనాభం.

పూజారి ఆచారి అష్టోత్తరం మొదలెట్టాడు. అమ్మవారి పాదాల మీద కుంకుమ అక్కసుగా విసిరి చల్లుతూ, ఎక్స్‌ప్రెస్ స్పీడులో ఒకటిన్నర నిమిషంలో అష్టోత్తరం ముగించి హారతి వెలిగించాడు!

"మీరు అష్టోత్తరం చదువుతుంటే అది ఏ దేవుడి అష్టోత్తరమో ఆ దేవుడికి కూడా తెలియనంతటి వేగంగా ఉందండీ !" అన్నాడు నవ్వుతూ, తీర్థం పుచ్చుకుంటూ.

"ఆ‌ఁ ! ప్రాణమున్న మనుషులకే ఎదుటి మనుషుల బాధ, భాషా అర్థంగానప్పుడు, ప్రాణం లేని రాతి విగ్రహాలకు మంత్రాలు ఎలా చదివితే నేం లెండి !" అన్నాడు అచారి, శఠగోపురం తలమీద తాకిస్తూ ! గతుక్కు-మన్నాడు పద్మనాభం.

లెక్కలు పూర్తయ్యాయి. నగలు వేరు చేస్తున్నప్పుడు వారందరి కళ్ళలో మెరుస్తున్న ఆశ నిరాశలు కొండ బయట పారిపోతున్న వెలుగులా, పరుచుకుంటున్న చీకట్లలా తోచాయి పద్మనాభానికి.

"రేపు మీలో ముఖ్యమైన వారందరూ కొండ దగ్గరికి వస్తారుకదూ? కొండ కావేపు వున్న మెట్లబాటవైపు బస్సురోడ్డుకు ఓ ప్లాన్ వేసు కుందాం !" అన్నాడు పద్మనాభం లేస్తూ.

"అలాగే !" అన్నాడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు కనకారావు. మిగతా వారూ తల లాడించారు.

మరునాడు ఉదయం కాస్త పొద్దెక్కాక పద్మనాభరావు, కనకా రావు, పూజారులూ, మంగళ్ళూ, నౌకర్లూ కోలాహలంగా బయలుదేరారు ఆ లోయవేపు ఉన్న మెట్ల మీదుగా—ఆ దారి తెలిసిన బలిష్ఠులైన యువకు లిద్దరు—కట్టెలు కొట్టి అమ్ముకొనేవారు—వీరందరికీ ముందుగా తోవ చూపుతూ నడుస్తున్నారు.

"ఇదేమిటి ? ఈ రోజు కొండమీద దేవుడికి పూజ జరగదే ? మీ రంతా ఎందుకు వెళుతున్నారు ?" అని త్రోవలో అడిగినవారికి, "పద్మ నాభరావుగారు కొండ మీదికి బస్సు రోడ్డేయిస్తారంట !" అంటూ జవాబు

చెబుతున్నారు వ్యంగ్యంగా, అక్కసుగా మంగలి వీరాస్వామి, పూజారి నరసయ్య వగైరాలు.

ముందుగా ఆ యువకులు నడుస్తున్నారు. వారి వెనకగా పక్క పక్కనే పద్మనాభరావూ, కనకారావూ నడుస్తున్నారు. వారి వెనకగా పూజారులూ, మంగళ్ళూ, నౌకర్లూ నడుస్తున్నారు. జనసంచారం లేని త్రోవ. తుప్పలు, ముళ్లు, జారుతున్న మెట్లు, ఎండుటాకులు.... అందరికీ శ్రమగానే ఉంది నడవటం పట్టుదలగా నడుస్తున్నాడు పద్మనాభం. అత గాడి కళ్ళముందు మరో సంవత్సరం తరువాత ఈ రోడ్డుమీద యాత్రి కులతో నిండిన బస్సు వెడుతున్న దృశ్యం కనిపిస్తూంది.

"మీకు అంటే కోపంగానీ, మీ పట్టుదలే మీది గానీ దానివల్ల ఎందరు బాధపడుతున్నా రన్నది మీరు గమనించు కోవటం లేదు!" అన్నాడు కనకారావు, ఆయాసంగా శ్వాస పీల్చుకుంటూ. ఇంకా ఏదో చెప్పబోతున్న అతగాడి మాటలకు అడ్డొస్తూ నవ్వాడు పద్మనాభం. "జరిగేది మంచి పని అయినప్పుడు, కొన్ని తరాలవారికి శాశ్వతంగా మేలు అయినప్పుడు ఏ కొద్ది మందో బాధపడినా పర్వాలేదు. ఆ కొద్ది మందికీ బాధ కలిగించటమే నేను చేసిన తప్పు అయితే, ఆ దేవుడు నన్ను క్షమించక పోడులెండి!" పద్మనాభం రెండు చేతులెత్తి భక్తి పురస్సరంగా కొండమీది గుడివేపు చూచి, కళ్లు మూసుకున్నాడు.

అరక్షణంలో ఎందరి కళ్లలోనో నిప్పురవ్వలు, పైశాచిక విస్ఫు లింగాలు.

పద్మనాభం శరీరం ఒక్కసారిగా గాలిలోకి లేచింది!

తన కాలు జారలేదని అతగాడికి తెలుసు. తప్పటడుగు వేయ లేదని అతగాడికి తెలుసు. అయినా....అయినా....కొండమీది దేవుడి వేపు

జోడించిన చేతులు విడివడేలోగా....అగాధంలో .... అతగాడి శరీరం.... నెత్తురుముద్దలా ఏ బండరాయి మాటుకో దొర్లిపోయింది.

"ఎన్నడూ లేనిది కొండమీదికి తరతరాలుగా నడిచి వెళుతుంటే ఈ నాడు కొత్తగా రోడ్డు వేస్తానంటూ బయలుదేరి, కొండ పగలగొట్టటానికి ప్రయత్నిస్తే, దేవుడూరుకొంటాడా ?" అన్నారు చిల్లరదేవుళ్లు !

కొండమీద దేవుడు దేనికీ ఉలకలేదు, పలకలేదు !

("ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక" 31-1-73)